సాక్షి

భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 11 । అక్టోబర్ । 2025



విద్యుదుత్పత్తి అంతంతే..

ధర కారణంగా థర్మల్ విద్యుత్ వాడకాన్ని తగ్గిస్తుండగా.. పాల్వంచ కర్మాగారాల్లో ఉత్పత్తి సైతం తగ్గిస్తున్నారు. 8లో



క్రీడలతో ఉజ్వల భవిష్యత్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం

28° / 23°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం పంచామృతాలతో వైభవంగా అభిషేకం చేశారు. తొలుత అమ్మవారి జన్మస్థలంవద్ద పంచామృతాలతో పాటు పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆ తర్వాత నివేదన, పంచహారతి, నీరాజన మంత్రపుష్పం సమర్పించారు. కుంకమ పూజ, గణపతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



భవ్య శ్రీలక్ష్మి

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటకు చెందిన కేశబోయిన భవ్య శ్రీలక్ష్మి రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో శ్రీలక్ష్మి అద్భుత ప్రతిభ కనబర్చింది. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి విద్యార్థులు ఈ పోటీలకు హాజరు కాగా శ్రీలక్ష్మి ప్రథమ స్థానంలో నిలవడం విశేషం. వచ్చేనెలలో ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలకు బాలిక హాజరు కానుంది. కాగా, శ్రీలక్ష్మి ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

175 మంది అధికారులకు పదోన్నతి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా వివిధ ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న 175 మంది అధికారులకు కేడర్ స్కీమ్‌లో భాగంగా పదోన్నతులు కల్పిస్తూ కార్పొరేట్ కార్యాలయం ఈఈ సెల్ హెచ్‌ఓడీ ఏజే మురళీధర్‌రావు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ జాబితాలో డిప్యూటీ మేనేజర్, అడిషినల్ మేనేజర్, సీనియర్ అండర్ మేనేజర్, అండర్ మేనేజర్, సీనియర్ సర్వే ఆఫీసర్, సర్వే ఆఫీసర్, డీవైఎస్ఈ, ఈఈ, సీనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, మెడికల్ ఆఫీసర్ స్థాయి అధికారులు ఉన్నారు.

డబ్లింగ్ లైన్ పనులు పరిశీలన

కారేపల్లి: కారేపల్లి రైల్వేస్టేషన్ మీదుగా నిర్మిస్తున్న డబ్లింగ్ లైన్ పనులను దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం గోపాలకృష్ణ శుక్రవారం పరిశీలించారు. డోర్నకల్ రైల్వే జంక్షన్‌నుంచి కారేపల్లి మీదుగా కొత్తగూడెం(భద్రాచలం రోడ్డు) వరకు నిర్మించే లైన్ పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. కాగా, లైన్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారు పరిహారం చెల్లించాలని కోరగా డీఆర్ఎం సానుకూలంగా స్పందించారు. అనంతరం కారేపల్లి గ్రామస్తులు డీఆర్ఎంను కలిసి కరోనా సమయాన రద్దు చేసిన డోర్నకల్–భద్రాచలం రోడ్ మణుగూరు–కాజీపేట జంక్షన్ ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని కోరారు. అంతేకాక డోర్నకల్ నుంచి కొత్తగూడెం వరకు వెళ్లే అన్ని రైళ్లకు కారేపల్లిలో హాల్టింగ్ కల్పించాలని వినతిపత్రం ఇచ్చారు. గ్రామస్తులు సురేందర్‌రెడ్డి, సురేందర్ మణియార్, తురక నారాయణ, అజ్మీర బిచ్యానాయక్, తొగర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంధనంపై నజర్



కొత్తగూడెం బర్మాక్యాంపు మార్గంలో పెట్రోల్ బంక్ నిర్మాణానికి కేటాయించిన స్థలం

పెట్రోల్‌బంక్‌ల ఏర్పాటుకు సింగరేణి స్థలాల లీజు

- అదనపు ఆదాయం కోసం సంస్థ ప్రణాళిక
- ప్రతీ నెల లీజ్ రెంట్, ఆయిల్‌పై కమీషన్
- ఎన్‌ఓసీలు తీసుకునే పనిలో నిమగ్నం



కొత్తగూడెంఅర్బన్: బొగ్గు ఉత్పత్తితో పాటు అదనపు ఆదాయం సమకూర్చుకునే మార్గాలను ఎంచుకుంటున్న సింగరేణి.. అందులో రాణించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. బంగారం, రాగి గనుల అన్వేషణ, సోలార్ విద్యుదుత్పత్తితో పాటు పెట్రోల్ బంకుల ఏర్పాటుకు సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో ఏడు ఏరియాల్లో బంకుల ఏర్పాటు ప్రక్రియ వేగవంతమవుతోంది. ఆయిల్ కంపెనీలకు సింగరేణి స్థలాలు లీజుకు ఇచ్చేందుకు పది రోజుల క్రితమే భూమి కేటాయించారు. తద్వారా సంస్థ స్థలాలను కాపాడుకోవడంతో పాటు వాటి నుంచి ఆదాయం రాబట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఆయిల్ కంపెనీలు బంక్‌లు నిర్మించి ఇస్తే వాటి నిర్వహణ బాధ్యతను సింగరేణి అధికారులే చూస్తారు. సంస్థ ఆధ్వర్యంలో పెట్రోల్, డీజిల్ బంక్‌ల ఏర్పాటుతో వాహనాదారుల్లోనూ హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఏడు బంకుల ఏర్పాటు..

సింగరేణి ప్రాంతాలైన మందమర్రి, బెల్లంపల్లి, కొత్తగూడెం, మణుగూరు, రామగుండం ఏరియాలో మొత్తం ఏడు బంకుల ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం ఆయిల్ కంపెనీలకు భూమిని సైతం కేటాయించగా.. ఎన్‌ఓసీ కోసం ఆయా జిల్లాల కలెక్టర్లతో పాటు నాగపూర్‌లోని పీఈఎస్‌ఓకి ఆయా కంపెనీల యాజమాన్యాలు దరఖాస్తు చేశాయి. అనుమతి రాగానే పెట్రోల్ బంకుల ఏర్పాటు పనులు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం కేటాయించిన స్థలాలను చదును చేస్తున్నారు. ఆయిల్ కంపెనీలు పెట్రోల్ బంకులు నిర్మించి సింగరేణికి అప్పగిస్తే.. నిర్వహణ బాధ్యతలను సంస్థ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. సింగరేణి స్థలానికి లీజుతోపాటు లీటర్ పెట్రోల్, డీజిల్ విక్రయాలపై రూ.2 చొప్పున కమీషన్ ఇచ్చేందుకు ఆయిల్ కంపెనీలు ఒప్పందం చేసుకున్నాయి. తొలిదశలో ఏడు బంక్‌లు నిర్మిస్తుండగా.. ఇవి విజయవంతంగా నడిస్తే భవిష్యత్‌లో మరిన్ని బంకుల ఏర్పాటుకు అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. పెట్రోల్ బంకుల ఏర్పాటుతో స్థానికంగా ఉండే నిరుద్యోగులకు కూడా ఉపాధి లభించే అవకాశం ఉంటుంది.

తొలగనున్న ఇక్కట్లు..

ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ వినియోగదారులు.. కొన్ని బంకుల వారు చేసే మోసాలతో నష్టపోతున్నారు. డబ్బులు సరిగానే తీసుకుంటున్నా పెట్రోల్, డీజిల్ తక్కువగా కొట్టడం, ఇంధనంలో కల్తీ వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తద్వారా వాహనాలు సైతం మరమ్మతులకు గురవుతున్నాయి. పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీలు చేసి బంక్ నిర్వాహకులకు జరిమానాలు విధిస్తున్నా.. చాలా బంక్‌ల యాజమాన్యాల్లో ఎలాంటి మార్పు రావడం లేదు. ఈ క్రమంలో సింగరేణి ఆధ్వర్యంలో పెట్రోల్, డీజిల్ బంక్‌ల ఏర్పాటుతో నాణ్యమైన ఇంధనం లభ్యమవుతుందని, తగ్గింపులు ఉండవని వాహనదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

భద్రాద్రి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- ఖమ్మంలో టీటీడీ ఆలయానికి 13న స్థల పరిశీలన
- దేవాదాయ శాఖ అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: దేశంలోనే ప్రత్యేకత సంతరించుకున్న భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, అధికారులతో శుక్రవారం ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భద్రాచలం ఆలయ విస్తరణ కోసం భూసేకరణ పూర్తయిందన్నారు. మాడవీధుల విస్తరణ, ప్రాకార గోడల నిర్మాణాలు తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. ఆగమశాస్త్ర ప్రమాణాలకు అనుగుణంగా ఆర్కిటెక్ట్ రూపొందించిన డిజైన్లను ఖరారు చేసి పనులు వేగవంతం చేయాలన్నారు. భక్తులకు వసతి, రవాణా, పార్కింగ్, నీటి సదుపాయాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి తుమ్మల సూచించారు. భద్రాద్రి రామాలయం దేశవ్యాప్తంగా భక్తులను ఆకర్షించేలా అధికారులు నిరంతరం పనులను పర్యవేక్షించాలని అన్నారు.

టీటీడీ ఆధ్వర్యాన ఆలయ నిర్మాణం

తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆధ్వర్యాన ఖమ్మం నగరంలో వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తుమ్మల తెలిపారు. ఇందుకోసం మూడు ప్రాంతాలను కలెక్టర్ టీటీడీ అధికారులకు ప్రతిపాదించినట్లు చెప్పారు. ఈ మేరకు వచ్చే సోమవారం టీటీడీ అధికారులు ఖమ్మంలో పరిశీలించి ఆలయ స్థలాన్ని ఖరారు చేస్తారని మంత్రి వెల్లడించారు.

అటవీ ఉద్యోగుల క్రీడలు షురూ..

- జోనల్ పరిధి నుంచి హాజరైన ఉద్యోగులు
- పోటీలను ప్రారంభించిన సీసీఎఫ్ భీమానాయక్



పోటీలను ప్రారంభిస్తున్న సీసీఎఫ్ భీమానాయక్

చుంచుపల్లి: రెండు రోజుల పాటు నిర్వహించనున్న అటవీ శాఖ ఉద్యోగుల జోనల్ స్థాయి క్రీడా పోటీలను కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో సీసీఎఫ్ భీమానాయక్ శుక్రవారం ప్రారంభించారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల ఉద్యోగులకు 800 మంది అథ్లెటిక్స్, వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, షటిల్, రన్నింగ్ తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. తొలిరోజు కబడ్డీ, షటిల్, రన్నింగ్, వాలీబాల్, క్రికెట్ పోటీల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల ప్రారంభం సందర్భంగా భీమానాయక్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఒత్తిడితో ఉండే ఉద్యోగులకు క్రీడల ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. అటవీ, పర్యావరణ పరిరక్షణలో ఉద్యోగుల పాత్ర మరువలేనిదని చెప్పారు. ఇదే సమయాన క్రీడలపై ఆసక్తి చూపాలని సూచించారు. రెండు రోజుల పాటు నిర్వహించే పలు క్రీడాంశాల్లో చురుగ్గా పాల్గొని ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల డీఎఫ్‌ఓలు, ఎఫ్‌డీఓలు, డీఆర్‌ఓలు, రేంజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణకవచాలంకరణలో రామయ్య



భారీగా హాజరైన భక్తులు

నిత్యకల్యాణానికి హాజరైన 200 మంది చెన్నై భక్త దంపతులు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు శుక్రవారం స్వర్ణకవచాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, నిత్యకల్యాణ వేడుకకు చెన్నై భక్తులు పోటెత్తారు. ఏకకాలంలో 200 మంది దంపతులు పాల్గొనడంతో చిత్రకూట మండపం కిటకిటలాడింది. చెన్నైలోని ఓ ఆధ్యాత్మిక సంస్థకు చెందిన సభ్యులు ముందుగానే నిత్యకల్యాణ టికెట్లు బుక్ చేసుకున్నారు. కల్యాణం అనంతరం స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చెన్నై, ఇతర భక్తులు కలిపి మొత్తం 240 జంటలు నిత్యకల్యాణంలో పాల్గొనడం రికార్డుగా నమోదైంది. కాగా, శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

పది రోజుల్లో పత్తి కొనుగోళ్లు

- జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలతో సీసీఐ చర్చలు
- నిబంధనల సడలింపుతో టెండర్ల దాఖలు
- క్రాప్ బుకింగ్ ఆధారంగా స్లాట్ల కేటాయింపు



జిన్నింగ్ మిల్లులో పత్తిని పరిశీలిస్తున్న వ్యాపారులు (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లకు రంగం సిద్ధమైంది. ఇన్నాళ్లు సీసీఐ నిబంధనలు కఠినంగా ఉన్నాయని జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు టెండర్లకు దూరంగా ఉన్నాయి. ఆగస్టు మొదటి వారంలోనే సీసీఐ జిన్నింగ్ మిల్లులను గుర్తించి, మూడుసార్లు గడువు పొడిగించినా టెండర్ల దాఖలకు ముందుకు రాలేదు. ప్రభుత్వ కొనుగోళ్లు లేకపోవడంతో తేమ, నాణ్యత సాకుతో వ్యాపారులు క్వింటాకు రూ.6 వేలు మించి చెల్లించడం లేదు. ఫలితంగా కేంద్రప్రభుత్వం పత్తికి తేమశాతం ఆధారంగా రూ.8,110గా నిర్ణయించిన గరిష్ఠ దక్కక రైతులు నష్టపోతున్నారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని మరోమారు చర్చలు జరిపి నిబంధనల్లో కొన్ని మార్పులు చేయడంతో ఉమ్మడి జిల్లాలోని 15మిల్లుల యజమాన్యాలు టెండర్లు దాఖలు చేశాయి. ఈ టెండర్లను పరిశీలించి కలెక్టర్ల ఆమోదంతో వారంలోగా ఖరారు చేయనున్నారు. ఆపై పది రోజుల్లోగా సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు మొదలుకానున్నాయి.

క్రాప్ బుకింగ్ ఆధారంగానే...

సీసీఐ పత్తి కొనుగోళ్లకు క్రాప్ బుకింగ్ ముడిపడి ఉండటంతో వ్యవసాయ శాఖ పంట నమోదును వేగవంతం చేసింది. కొనుగోళ్లలో పారదర్శకత కోసం స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకొచ్చారు. దీనికోసం 'కపాస్ కిసాన్ యాప్'ను ప్రవేశపెట్టగా వ్యవసాయ అధికారులు పంట నమోదు పూర్తి చేసి వివరాలను మార్కెటింగ్ శాఖకు సమర్పించాల్సి ఉంటుంది. ఈ వారంలో ఇది కూడా పూర్తయితే యాప్‌లోనే రైతులు స్లాట్ బుక్ చేసుకొని నేరుగా కేటాయించిన జిన్నింగ్ మిల్లులో పత్తి విక్రయించుకునే అవకాశం ఏర్పడుతుంది. ఇదంతా త్వరలోనే పూర్తిచేసి ఈనెల 22, 23వ తేదీ నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడానికి సమాయత్తమవుతున్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఇవే...

ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పరిధి ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరిలోని జీఆర్ఆర్ ఇండస్ట్రీస్, తల్లంపాడులోని శ్రీ సాయి బాలాజీ జిన్నింగ్ అండ్ ఆయిల్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు చేయనుంది. అలాగే, మధిర మార్కెట్ పరిధి దెందుకూరులోని అమరావతి టెక్స్‌టైల్స్, మాటూరులోని మంజీత్ కాటన్ మిల్, ఇల్లెందులపాడులోని శ్రీ శివ గణేష్ కాటన్ ఇండస్ట్రీస్, నేలకొండపల్లి మార్కెట్ పరిధి ముదిగొండ మండలం సువర్ణాపురంలోని ఉషశ్రీ కాటన్ అండ్ జిన్నింగ్ మిల్, వైరా మార్కెట్ పరిధి తల్లాడలోని స్టార్ రిచ్ జిన్నింగ్ ఇండస్ట్రీస్, మద్దులపల్లి మార్కెట్ పరిధి ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని జీఆర్ఆర్ జిన్నింగ్ మిల్, తిరుమలాయపాలెం మండలం గోల్‌తండాలోని శ్రీ భాగ్యలక్ష్మి కాటన్ ఇండస్ట్రీస్‌తో పత్తి కొనుగోలు చేస్తారు. ఇక భద్రాద్రి జిల్లాకు సంబంధించి ఇల్లెందు మార్కెట్ పరిధి కారేపల్లిలోని లక్ష్మీప్రియ జిన్నింగ్ మిల్, శ్రీలక్ష్మీప్రియ కాటెక్స్ జిన్నింగ్ మిల్, కొత్తగూడెం మార్కెట్ పరిధిలోకి వచ్చే కొత్తగూడెంలోని మంజీత్ జిన్నింగ్ మిల్, బూర్గంపాడు మార్కెట్ పరిధి బూర్గంపాడులోని అనూశ్రీ జిన్నింగ్ మిల్, శ్రీ లక్ష్మీనర్సింహ జిన్నింగ్ మిల్, శ్రీ రమేష్ ఇండస్ట్రీస్ జిన్నింగ్ మిల్, భద్రాచలం మార్కెట్ పరిధి అశ్వాపురంలోని శ్రీరామా జిన్నింగ్ మిల్లులోపత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పత్తి సాగు విస్తీర్ణం, దిగుబడి అంచనా

జిల్లా	సాగు (ఎకరాల్లో)	దిగుబడి (క్వింటాళ్లలో)
ఖమ్మం	2,25,613	27,07,356
భద్రాద్రి కొత్తగూడెం	2,40,345	28,05,576

తేమ శాతం ఆధారంగా పత్తి ధర (రూ.ల్లో)

తేమ	మద్దతు ధర
8	8,110
9	8,029
10	7,948
11	7,867
12	7,786

పాల్వంచలో మరో థర్మల్ ప్లాంట్ !

- సాధ్యాసాధ్యాలు పరిశీలించాలన్న జెన్‌కో
- ప్రైవేట్ కన్సల్టెన్సీకి బాధ్యతలు..
- అందుబాటులో 400 ఎకరాల స్థలం



కొత్త ప్లాంట్ నిర్మాణానికి పరిశీలించనున్న స్థలం ఇదే..

పాల్వంచ: పాల్వంచలో మరో థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటుకు ముందడుగు పడింది. కొత్తగా ఒకటి లేదా రెండు ప్లాంట్ల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై నివేదిక తయారు చేయాలని జెన్‌కో యాజమాన్యం న్యూ ఢిల్లీకి చెందిన డిజైన్ ప్రైవేట్ లిమిటెడ్ కన్సల్టెన్సీకి అప్పగించింది. ఈ మేరకు కన్సల్టెన్సీ బృందం పాత ప్లాంట్ ప్రదేశంలో త్వరలో సర్వే చేపట్టనుంది. అయితే అల్ట్రా సూపర్ క్రిటికల్ టెక్నాలజీ కలిగిన 800 మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటు సాధ్యమేనా అనే అంశంపైనా పరిశీలన చేయనున్నారు.

ఖాళీగా 400 ఎకరాలు..

పాత ప్లాంట్ కూల్చివేతతో సుమారు 400 ఎకరాల స్థలం ఖాళీ అయింది. ఇక్కడ నీటి వనరులు, రైల్వే మార్గం, సింగరేణి బొగ్గు, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లు, రిజర్వాయర్‌లు, యాష్ పాండ్‌ల వంటి భౌగోళిక వనరులు అందుబాటులో ఉన్నందున తక్కువ ఖర్చుతో మరో ప్లాంట్ నిర్మించాలని పలువురు కోరారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సైతం ఇటీవల పార్లమెంట్‌లో ఇదే అంశాన్ని కోరగా కేంద్రం సుముఖత వ్యక్తం చేసి తమ వంతు నిధులు ఇచ్చేందుకు ముందుకొచ్చింది. ఈ క్రమంలో జెన్‌కో యాజమాన్యం కొత్త ప్లాంట్ సాధ్యాసాధ్యాలపై సర్వే చేయాలని ఢిల్లీకి చెందిన డిజైన్ కంపెనీకి బాధ్యతలు అప్పగించింది. త్వరలోనే సదరు కంపెనీ బృందం కర్మాగారాన్ని సందర్శించనుంది.

పాత ప్లాంట్ కూల్చివేతతో తీరని నష్టం..

పాల్వంచలో 1965 – 78 మధ్య కాలంలో కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారాన్ని నిర్మించారు. ఇందులో ఏ, బీ, సీ స్టేషన్లలో 1, 2, 3, 4 యూనిట్లు ఏర్పాటు చేసి 720 మెగావాట్ల విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. జపాన్ టెక్నాలజీతో తొలి యూనిట్ నిర్మాణానికి రూ.59.29 కోట్లు ఖర్చు చేశారు. ఈ కర్మాగారం కాలం చెల్లడంతో పర్యావరణ పరిస్థితుల దృష్ట్యా 2018లో మూసేశారు. అనంతరం ఈ కర్మాగారంలో దశల వారీగా కూల్చివేత పనులు చేపట్టి గతేడాది ఆగస్టు 5న చివరగా కూలింగ్ టవర్లను నేలమట్టం చేశారు. అయితే ఈ కర్మాగారం తొలగింపుతో ఇక్కడ పనిచేసే ఉద్యోగులు సుమారు 2,500 మందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాల్సి వచ్చింది. దీని ప్రభావం ఈ ప్రాంత అభివృద్ధిపై కూడా పడింది. కొత్తగా సూపర్ క్రిటికల్ టెక్నాలజీ కలిగిన 7వ దశ నిర్మాణం జరిగినా తక్కువ మంది ఉద్యోగులతోనే కర్మాగారం నడుస్తుండడంతో అత్యధిక శాతం మంది ఇతర ప్రాంతాలకు తరలివెళ్లారు.

స.హ.చట్టం.. శక్తివంతమైన ఆయుధం

కలెక్టర్ జితేష్ వి పాటిల్



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రతీ పౌరుడు సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలని, తద్వారా ప్రభుత్వ కార్యకలాపాలపై సమాచారం పొందడమే కాక ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ చట్టం ప్రజలకు శక్తినిచ్చే పదునైన ఆయుధం వంటిదని అన్నారు. పారదర్శకత పెంపొందించి, అధికారుల్లో జవాబుదారీతనాన్ని నెలకొల్పుతుందని చెప్పారు. ప్రజలు కోరిన సమాచారాన్ని సకాలంలో అందించడం ద్వారా పాలనలో విశ్వసనీయత పెరుగుతుందని అన్నారు. శాఖల వారీగా నిర్వహిస్తున్న కార్యకలాపాలు, సేవలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరచాలని ఆదేశించారు. ప్రతీ కార్యాలయంలో పీఐఓ, ఏపీఐఓ, అప్పీలేట్ అథారిటీని నియమించి, ఆర్టీఐ దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించాలని అన్నారు. సమాచారం ఇచ్చేందుకు నిరాకరించాల్సి వస్తే అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. అన్ని శాఖల సిబ్బందికి ఈ చట్టంపై అవగాహన కల్పించాలని, ఈ మేరకు శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, సీపీఓ సంజీవరావు, డీఏఓ బాబురావు, డీఎంహెచ్ఓ జయలక్ష్మి, డీఎస్ఓ రుక్మిణి, బీసీ సంక్షేమాధికారి విజయలక్ష్మి, ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్, భూగర్భ జల శాఖాధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ..

కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ జితేష్ వి పాటిల్ శుక్రవారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు తనిఖీ చేశామని, ఈవీఎం, వీవీ ప్యాట్లు ఉన్న గదిని, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించామని తెలిపారు. గోడౌన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవరిని లోపలికి రానివ్వొద్దని అధికారులను, సెక్యూరిటీ గార్డ్‌ను ఆదేశించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్లో సంతకం చేశారు. ఆయన వెంట ఎన్నికల సూపరింటెండెంట్ రంగాప్రసాద్, ఎలక్షన్ సెల్ సిబ్బంది నవీన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉమ్మడి జిల్లా క్రీడా పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కిన్నెరసాని డ్యామ్‌సైట్ గిరిజన బాలుర గురుకుల పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చాటి ఉమ్మడి జిల్లా పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్ తెలిపారు. పదో తరగతి చదువుతున్న మహేందర్ అండర్– 17 ఖోఖో, అండర్– 14 కబడ్డీ పోటీలకు కె.హర్షిత్, ఖోఖో పోటీలకు కె.దిక్షీత్ అర్హత సాధించారని వివరించారు. వీరిని ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఖో–ఖో జిల్లా జట్టుకు ఎంపిక


బూరుగడ్డ పవిత్ర

ఇల్లెందు/ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని బూరుగడ్డ పవిత్ర జిల్లా జట్టుకు ఎంపికైంది. గురువారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జిల్లా స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించగా, అండర్ –14 విభాగంలో విద్యార్థిని ప్రతిభ చూపింది. త్వరలో భద్రాద్రి, ఖమ్మం జిల్లా జట్ల మధ్య జరిగే పోటీల్లో పాల్గొననుంది. పవిత్రను పాఠశాల హెచ్ఎం సుధాకర్, పీఈటీ రాంబాబు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు అభినందించారు.

నేడు ఉమ్మడి జిల్లా ఖో–ఖో ఎంపిక పోటీలు

కల్లూరు: అండర్–19 బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపికకు శనివారం కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో పోటీలు నిర్వహించనున్నారు. అలాగే, చదరంగం జట్ల ఎంపిక పోటీలు ఆదివారం జరుగుతాయని జిల్లా పాఠశాల ల క్రీడల సంఘం కార్యదర్శి ఎండీ.మూసా ఖలీం తెలిపారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు చదువుతున్న బాలబాలికలు అర్హులని, ఆసక్తి ఉన్న వారు విద్యార్హతల సర్టిఫికెట్లు, మెమో, బోనఫైడ్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

డీఎంఎల్‌టీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

చుంచుపల్లి: 2025–26 విద్యాసంవత్సరానికి కొత్తగూడెం వైద్య కళాశాలలో డీఎంఎల్‌టీ 30, డయాలసిస్ టెక్నీషియన్లు 30 సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.హరిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ బైపీసీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు వైద్య కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

రూ. 22 వేలు కాజేసిన హ్యాకర్

దుమ్ముగూడెం : మండలంలోని పెద్దనల్లబల్లి గ్రామానికి చెందిన మట్టా శేఖర్‌బాబు అకౌంట్‌ను హ్యాక్ చేసిన సైబర్ మోసగాళ్లు రూ.22,400 తస్కరించారు. శుక్రవారం బాధితుడు వివరాలు వెల్లడించాడు. హెచ్‌డీఎఫ్‌సీ అకౌంట్ ఖాతా నుంచి నగదు రూ.22,400 డ్రా చేసినట్లు శేఖర్‌బాబు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో ఆయన బ్యాంకు అధికారులను సంప్రదించగా అకౌంట్ హ్యాక్ చేసి, నగదు డ్రా చేశారని తెలిపారు. దీంతో బాధితుడు హైదరాబాద్‌లోని సైబర్ క్రైం పోలీసులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశాడు.

ఆకతాయిల దాడిలో వ్యక్తికి గాయాలు

కొత్తగూడెంటౌన్: ఆకతాయిల దాడిలో ఓ వ్యక్తి గాయపడ్డ ఘటన శుక్రవారం టూటౌన్ ఏరియా పరిధిలోని రామవరంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. రుద్రంపూర్‌లోని సెంటర్‌లో మద్యం తాగుతున్న యువకులను బొమ్మకంటి మధుకర్ అనే వ్యక్తి గతంలో మందలించాడు. చిన్నవయసులో మందు తాగొద్దని, మీ ఇంట్లో చెప్తానని హెచ్చరించాడు. ఆ విషయం మనసులో పెట్టుకుని అదే ప్రాంతానికి చెందిన రుద్రాక్ష్ (షానూ)అనే వ్యక్తి బీరు సీసాతో మధుకర్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో తలకు, చేతులకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రతాప్ తెలిపారు.

కోతుల దాడిలో వృద్ధుడికి తీవ్రగాయాలు


గాయపడ్డ వృద్ధుడు

పాల్వంచరూరల్: ఇంటి మీదకు వచ్చాయని అదిలించబోగా కోతులు దాడి చేయడంతో వృద్ధుడికి తీవ్రగాయాలయ్యాయి. శుక్రవారం మండలంలోని నారాయణరావుపేట గ్రామానికి చెందిన వృద్ధుడు కొల్లు పెద్ద సుబ్బారెడ్డి ఇంటిమీద కోతులు వచ్చాయి. వాటిని కర్రతో తరిమే ప్రయత్నం చేయగా, అవి తిరిగి దాడి చేశాయి. దీంతో వృద్ధుడు కిందపడగా చేతులు, తలపై కరవడంతో స్పృహతప్పాడు. పక్క ఇంటివాళ్లు గమనించి వచ్చి కోతులను తరిమివేశారు. వృద్ధుడిని ఆటోలో పాల్వంచలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,400

థర్మల్ విద్యుదుత్పత్తి అంతంతే!

- కేటీపీఎస్, బీటీపీఎస్ ప్లాంట్లలో రిజర్వ్ షట్‌డౌన్
- కొద్దిరోజులుగా తగ్గిన థర్మల్ విద్యుత్ వినియోగం


కేటీపీఎస్ కాంప్లెక్స్

పాల్వంచ: ధర అధికంగా ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం థర్మల్ విద్యుత్ వినియోగం తగ్గిస్తున్నట్లు తెలుస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో మినహా మిగతా సమయాల్లో యూనిట్లను రిజర్వ్ షట్‌డౌన్‌లో ఉంచుతోంది. ఈ క్రమంలో తక్కువ ధరకు వస్తున్న హైడల్, సోలార్ విద్యుత్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఫలితంగా జిల్లాలోని కేటీపీఎస్, బీటీపీఎస్ విద్యుత్ కేంద్రాల్లో పలు యూనిట్లు రిజర్వ్‌షట్‌డౌన్‌లకే పరిమితమవుతున్నాయి. దీంతో జెన్‌కో సంస్థకు భారీగా నష్టం వాటిల్లుతోంది.

రిజర్వ్ షట్‌డౌన్‌లతో సతమతం

కేటీపీఎస్ 5,6 దశల కర్మాగారంలో 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి రావాల్సి ఉంది. 5వ దశలోని 250 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 9,10 యూనిట్లు గురువారం వరకు రిజర్వ్ షట్‌డౌన్‌లోనే ఉన్నాయి. అకస్మాత్తుగా 6వ దశలోని 11వ యూనిట్ బాయిలర్ ట్యూబ్ లీకేజీ ఏర్పడటంతో వెంటనే రిజర్వ్ షట్‌డౌన్‌లో ఉన్న 10వ యూనిట్‌ను అందుబాటులోకి తీసుకుని 11వ యూనిట్‌లో మరమ్మతు పనులు చేపట్టి శుక్రవారం పూర్తి చేశారు. ప్రస్తుతం 9,11 యూనిట్లు రెండూ రిజర్వ్ షట్‌డౌన్‌లోనే కొనసాగుతున్నాయి. వెయ్యి మెగావాట్లకు గాను 750 మెగావాట్లు రిజర్వ్‌షట్‌డౌన్‌లోనే నడుస్తున్నాయి. మణుగూరు బీటీపీఎస్ కర్మాగారంలో 1080 మెగావాట్లు కలిగిన 1,2,3,4 యూనిట్లలో 4,320 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కావాల్సి ఉంది. ప్రస్తుతం 1,2,4 యూనిట్లు రిజర్వ్‌షట్‌డౌన్‌లోనే ఉన్నాయి. ఫలితంగా 3,240 మెగావాట్ల ఉత్పత్తి తగ్గించారు. కేటీపీఎస్ 7వ దశ కర్మాగారంలో 800 మెగావాట్లకు గాను 460 మెగావాట్లు మాత్రమే తీసుకుంటూ మిగతాది బ్యాక్‌డౌన్‌లో ఉంచుతున్నారు. రాత్రి సమయాల్లో ఒకటి, రెండు గంటలు మినహా మిగిలిన సమయాల్లో బ్యాక్ డౌన్‌లో యూనిట్ నడిపిస్తున్నారు. ఈ విషయమై 5,6 దశల సీఈ ఎం.ప్రభాకర్ రావును వివరణ కోరగా.. థర్మల్ యూనిట్ ధర ఎక్కువగా ఉందని రిజర్వ్‌షట్‌డౌన్‌లో ఉంచుతున్నట్లు, రాత్రి సమయాల్లో లోడ్ తీసుకుంటూ పగలు తగ్గిస్తున్నట్లు తెలిపారు.

రచ్చకెక్కిన బీజేపీ

- నాయకుల మధ్య విభేదాలపై రాష్ట్ర పార్టీ ఆగ్రహం!
- నలుగురు నాయకులపై క్రమశిక్షణ చర్యలు?

పాల్వంచరూరల్: బీజేపీలో విభేదాలు రచ్చకెక్కాయి. స్థానిక ఎన్నికల అభ్యర్థుల ఎంపికకు అభిప్రాయాల సేకరణ కోసం నిర్వహించిన సమావేశంలో వర్గవిభేదాలు పొడసూపాయి. దీంతో రాష్ట్ర పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. పట్టణంలో గురువారం స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశం ప్రారంభంలోనే రసాభాసగా మారింది. మండల అధ్యక్ష, కార్యదర్శులు మాత్రమే ఉండాలని, మిగిలినవారు సమావేశ హాల్ నుంచి బయటకు వెళ్లిపోవాలని వేదికపై ఉన్న నేతలు మైకులో చెప్పారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు వాగ్వాదానికి దిగారు. ఒకరినొకరు నెట్టుకునే పరిస్థితి నెలకొంది. జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డిపై ఓ సీనియర్ గిరిజన నాయకుడు విమర్శలు చేయడంతో పార్టీలోని అంతర్గత విభేదాలు బయటపడ్డాయి.

సమావేశంలో గందరగోళం

స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక కోసం జిల్లాతోపాటు మహబూబాబాద్, ములుగు జిల్లాల మండల అధ్యక్షకార్యదర్శులను కూడా సమావేశానికి పిలిచినట్లు సమాచారం. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థులను ఎంపిక చేసేందుకు హుజూరాబాద్ మాజీ ఎమ్మెల్యే సైదారెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు మనోహర్, జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలతో రాష్ట్ర పార్టీ కమిటీని నియమించినట్లు సమాచారం. కమిటీ అభిప్రాయాలు సేకరించి రాష్ట్ర బాధ్యులకు పంపితే, వారు పరిశీలించి అభ్యర్థుల ఎంపికను పూర్తిచేస్తారు. ఈ క్రమంలో గురువారం అభిప్రాయాల సేకరణకు నిర్వహించిన సన్నాహక సమావేశం గందరగోళంగా మారింది.

క్రమశిక్షణ చర్యలు..

పార్టీలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన నాయకులపైన క్రమశిక్షణ కమిటీ చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గురువారం సన్నాహక సమావేశంలో జరిగిన రసాభాసపై రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ ఆరా తీసి, నివేదిక పంపాలని ఆదేశించినట్లు సమాచారం. నలుగురు నాయకులపై క్రమశిక్షణ వేటు పడనున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

హాహాకారాలు.. ఆర్తనాదాలు


ఎదురెదురుగా ఢీకొన్న ఆర్టీసీ బస్సులు


భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

- పాత సారపాక మూలమలుపు వద్ద రోడ్డు ప్రమాదం
- ఎదురెదురుగా రెండు ఆర్టీసీ బస్సులు ఢీ
- డ్రైవర్లు సహా 32మంది ప్రయాణికులకు గాయాలు

బూర్గంపాడు: పాత సారపాక మూలమలుపు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. తీవ్ర గాయాలై హాహాకారాలు చేశారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం ఉదయం 6.30గంటల సమయంలో భద్రాచలం ఆర్టీసీ డిపో బస్సు భద్రాచలం నుంచి ఖమ్మం వెళ్తోంది. అదే సమయంలో కొత్తగూడెం నుంచి భద్రాచలానికి కొత్తగూడెం ఆర్టీసీ డిపో బస్సు వస్తోంది. ఈ క్రమంలో పాత సారపాక మూలమలుపు వద్ద ఎదురెదురుగా రెండు బస్సులు ఢీ కొన్నాయి. దీంతో ఓ బస్సు కేబిన్‌లో మరో బస్సు కేబిన్ ఇరుక్కుపోయాయి. ఈ ఘటనలో రెండు బస్సుల డ్రైవర్లతోపాటు బస్సుల్లో ఉన్న 30 మంది ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదకరమైన ఈ మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న బస్సును గమనించి తప్పించే క్రమంలో ప్రమాదం జరిగినట్లు డ్రైవర్లు చెబుతున్నారు. ప్రమాదంతో కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎస్‌ఐలు మేడ ప్రసాద్, నాగభిక్షంలు ఘటనాప్రాంతానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఒకదాంట్లో మరొకటి ఇరుక్కుపోయిన బస్సులను జేసీబీ సాయంతో విడదీశారు.

భయభ్రాంతులకు గురైన ప్రయాణికులు

రెండు బస్సులు ఎదురెదురుగా ఢీ కొనటంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. అరుపులు, కేకలతో ఆర్తనాదాలు చేశారు. చేతులకు, తలకు, కాళ్లకు, ఒంటిపై గాయాలై రక్తం కారుతుండటంతో హాహాకారాలు చేశారు. భద్రాచలంలో బస్సు ఎక్కినవారు తమ బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఆస్పత్రికి తరలించారు. ఎవరికీ పెద్ద గాయాలు కాకపోవటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. భద్రాచలం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ డాక్టర్లను, సిబ్బందిని అప్రమత్తం చేసి వైద్యసేవలు అందించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా సారపాక మూలమలుపు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

శాంతి భద్రతలను పరిరక్షించాలి

కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్


మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

జూలూరుపాడు: శాంతి భద్రత పరిరక్షణే పోలీసుల ధ్యేయమని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. జూలూరుపాడు పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. రికార్డులు, ఫైల్స్ పరిశీలించారు. పనితీరు, పెండింగ్ కేసుల పురోగతి, కోర్టు పరిధిలో ఉన్న కేసుల వివరాలపై సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మి, జూలూరుపాడు, చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి ఎస్సైలు బాదావత్ రవి, శివరామకృష్ణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నతస్థానాలకు ఎదగాలని సూచించారు. చట్ట విరుద్ధ కార్యకలాపాలు, మాదకద్రవ్యాలతో జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు బండి వెంకటేశ్వరరావు, దనకొండ నరసింహారావు, బండి లక్ష్మణ్, రామలక్ష్మి, శ్రీరాములు, ప్రోగ్రాం కన్వీనర్ సముద్రాల శ్రీనివాస్, లైబ్రరీ బాబు, వన్ టౌన్ సీఐ కరుణాకర్ పాల్గొన్నారు.

రాళ్లు రువ్వుతున్న రహదారి

పగిలిపోతున్న దుకాణాల అద్దాలు


పగిలిన దుకాణం అద్దాలు

అశ్వారావుపేట: అశ్వారావుపేటలో ఏళ్ల తరబడి జరుగుతున్న సెంట్రల్ లైటింగ్, డివైడర్, రహదారి ఆధునికీకరణ పనులు ప్రజలకు శాపంగా పరిణవిఎంచాయి. నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డును తవ్వేసి వెట్‌మిక్స్ పోసి వదిలేశారు. దీంతో దుమ్ము రేగడంతోపాటు లారీల టైర్లకు తగిలి కంకర రాళ్లు ఎగిసి పడుతున్నాయి. రాళ్లు తగిలి దుకాణాల అద్దాలు పగిలిపోతున్నాయి. ఇళ్లలోకి వచ్చి పడుతున్నాయి. ఓ వ్యక్తి బైక్‌పై వెళుతుండగా రాయి వచ్చి ఛాతీపై తగలడంతో గాయపడ్డాడు. అశ్వారావుపేట –ఖమ్మం రహదారిలో నిత్యం ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అయినా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదు. రూ.18 కోట్ల పనులను ఏళ్లతరబడి నిర్వహిస్తున్నా ఆ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడంలేదు. భారీగా నగదు చేతులు మారిందని, అందుకే చర్యలు తీసుకోవడంలేదనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

పురుగుల మందు పిచికారీ చేస్తూ..

అస్వస్థతకు గురై గిరిజన రైతు మృతి


వాంకుడోత్ రవి (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని రేపల్లెవాడ గ్రామానికి చెందిన రైతు వాంకుడోత్ రవి (40) వరి పొలంలో శుక్రవారం పురుగుల మందు పిచికారీ చేస్తూ అస్వస్థతకు గురై మృతి చెందాడు. స్థానిక రైతుల కథనం ప్రకారం.. రవి తనకున్న ఎకరన్నర పొలంలో వరిసాగు చేశాడు. మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేపట్టాడు. గురువారం పత్తి చేనులో పురుగుల మందు పిచికారీ చేశాడు. శుక్రవారం వరి పొలంలో పురుగుల మందు పిచికారీ చేస్తుండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. పొలం నుంచి బయటకు వచ్చి నేలపై వాలిపోయాడు. గమనించిన సమీప రైతులు ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మార్గమధ్యలోనే మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య సరిత, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య, కాంగ్రెస్ నాయకులు పోటు రవి, కృష్ణ, శారద తదితరులు మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

నీటి గుంతలో పడి చిన్నారి మృతి

దుమ్ముగూడెం: నీటి గుంతలో పడి 18 నెలల బాలుడు శుక్రవారం మృతి చెందాడు. మండలంలోని నడికుడి గ్రామానికి చెందిన తుష్టి సురేష్–అమ్మోజి దంపతులకు కుమారుడు అక్షయ్‌కుమార్ ఉన్నాడు. ఇంట్లో తల్లి బట్టలు ఉతుకుతుండగా బాలుడు ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇంటి నిర్మాణం కోసం తీసిన గుంతలో నీరు నిండి ఉండగా, ఆ గుంతలో పడిపోయాడు. బట్టలు ఉతికిన అనంతరం తల్లి వెతకగా బాలుడు నీటి గుంతలో తేలి ఉన్నాడు. దీంతో నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. వైద్యులు సీపీఆర్ చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. బాలుడు మృతి చెందాడని వైద్యులు తెలిపారు. బాలుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

కొత్తగూడెంటౌన్: దారి దోపిడీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్ కథనం ప్రకారం.. ఈ నెల 3న కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో మద్యం మత్తులో ఉన్న నర్సయ్యను రామవరంలోని ఇంటి వద్ద దింపుతామని సబ్బవరం ప్రవీణ్, సబ్బవరం వరణ్‌లు నమ్మించి కిరాయికి ఆటో తీసుకుని వెళ్లారు. రామవరం గోధుమవాగు వద్దకు చేరుకున్నాక నర్సయ్యను దింపి, అతని దగ్గర ఉన్న రెండు బంగారు ఉంగరాలను(ఐదు గ్రాములు) తీసుకుని పారిపోయారు. మరుసటి బాధితుడు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ ఎం.కరుణాకర్ తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: ఖమ్మం–పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ మధ్య సూర్యాపేటకు చెందిన మనన ప్రతాప్‌సింగ్(56) అనారోగ్య కారణాలతో గురువారం రాత్రి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విజయవాడ మార్గంలో వెళ్తున్న నవజీవన్ ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆయన బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆయన వద్ద లభించిన సిమ్ కార్డ్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామని జీఆర్పీ హెడ్ కానిస్టేబల్ కె.శ్రీనివాసరావు తెలిపారు.

జామాయిల్ చెట్ల నరికివేతపై కేసు నమోదు

ములకలపల్లి: జామాయిల్ చెట్లు నరికివేతపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై మధుప్రసాద్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని పొగళ్లపల్లి శివారు అటవీశాఖ (టీజీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో జామాయిల్ తోటలను పెంచుతున్నారు. ఈ నెల 5న అక్రమంగా జామాయిల్ చెట్లు నరుకుతుండగా, స్థానిక సిబ్బంది చేరుకునేలాగో నిందిడుతు పరారయ్యాడు. దంతెలబోరు గ్రామానికి చెందిన కాకర్ల చిన్నముత్యాలు అనే వ్యక్తి ప్లాంటేషన్‌లోని 80 చెట్లు నేలకూల్చాడని, రూ. 30 వేల నష్టం వాటిల్లిందని ప్లాంటేషన్ మేనేజర్ (పీఎం) నాగరాజు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురిపై..

పాల్వంచరూరల్: పశువులు, మేకలు మేపి జామాయిల్ తోటకు నష్టం కలిగించిన ఘటనలో శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని మొండికట్ట గ్రామ శివారులో తొంగల వెంకన్నకు చెందిన భూమిలో జామాయిల్ మొక్కలను సాగు చేశాడు. శుక్రవారం అదే గ్రామానికి చెందిన సంపంగి మల్లేశ్, నవీన్, ఓర్సు మల్లేష్ పశువులు, మేకలను చేలో మేపడంతో నాలుగువేల మొక్కలకు నష్టం వాటిల్లింది. బాధిత రైతు ఫిర్యాదుతో ముగ్గురు పశువుల కాపరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసిన యువకుడిపై..

దమ్మపేట: నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసిన యువకుడిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. అశ్వారావుపేట మండలంలోని దురదపాడు గ్రామానికి చెందిన కుంజా చందు(19) అచ్యుతాపురం క్రాస్ రోడ్డు వద్ద నిర్లక్ష్యంగా బైక్ నడుపుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేశాడు. పోలీస్ సైరన్ వాడుతూ, ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించాడు. డ్యూటీలో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ బాలకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాంతారావు


మాట్లాడుతున్న రేగా కాంతారావు

మణుగూరు రూరల్ : ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆరోపించారు. శుక్రవారం బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్‌ను తెరపైకి తెచ్చిందన్నారు. బీసీ రిజర్వేషన్‌పై రాజ్యాంగబద్ధంగా బిల్లు చేయాలని, ఇందుకు బీఆర్ఎస్ కూడా మద్దతు తెలుపుతుందని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు నాయకులు కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్, మాజీ జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, నాయకులు వట్టం రాంబాబు, ఎడ్ల శ్రీనివాస్, ముత్యంబాబు, అడపా అప్పారావు, నూకారపు రమేష్, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, వేర్పుల సురేష్, ముద్దంగుల కృష్ణ, రామకోటి, గుర్రం సృజన్ తదితరులు పాల్గొన్నారు.

టామ్‌కామ్ విదేశీ ఉద్యోగ డ్రైవ్

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఆధ్వర్యంలో ఉద్యోగ నియామక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాశాఖ అధికారి కొండపల్లి శ్రీరామ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీస్ దేశంలో హాస్పిటాలిటీ నిర్వహణలో 1000 మందికి ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు. నెలకు వేతనం రూ. 92 వేల నుంచి రూ.1.22 లక్షల వరకు ఉంటుందని వివరించారు. డిగ్రీ అర్హత కలిగినవారు, ప్రభుత్వ అనుమతితో నైపుణ్య ధ్రువీకరణ పత్రం పొందిన వారు అర్హులని పేర్కొన్నారు. ఉద్యోగులకు ఉచితంగా భోజనం, వసతి, బీమా సౌకర్యం కల్పిస్తారని, విమాన టికెట్ ధర కూడా చెల్లిస్తారని తెలిపారు. ఆంగ్లభాషలో నైపుణ్యం తప్పనిసరిగా ఉండాలని, వీసా ఖర్చులు అభ్యర్థులే భరించాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు రెజ్యూమ్‌ను tomcom.res@gmail.com పంపాలని కోరారు. ఇతర వివరాలకు 94400 52081, 94400 51452 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి, పక్కన అధికారులు, నిర్వాహకులు

- ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి
- రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నీ ప్రారంభం

ఖమ్మం స్పోర్ట్స్: ప్రపంచంలో కొన్ని చిన్నదేశాల పేర్లను సైతం గుర్తుపెట్టుకోవడానికి అక్కడి ప్రజలు క్రీడల్లో రాణించడమే కారణమని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందనే విషయాన్ని గుర్తించి విద్యార్థులను తీర్చిదిద్దేలా రాష్ట్రప్రభుత్వం నూతన క్రీడా పాలసీని ప్రవేశపెట్టిందని చెప్పారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో బాలసాని సన్యాసయ్య స్మారక రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పిల్లలను చదువుకే పరిమితం చేయకుండా క్రీడల్లోనూ తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం ఉంటుందని చెప్పారు. విద్యార్థులు కూడా గెలుపోటములను సమానంగా తీసుకుంటే ఉన్నత స్థాయికి చేరొచ్చని తెలిపారు. అనంతరం రఘురాంరెడ్డి కొద్దిసేపు టేబుల్ టెన్నిస్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. డీవైఎస్‌ఓ సునీల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుట్టా శంకరయ్య, కె.క్రిస్టోఫర్‌బాబు, పాల్గొన్నారు.

మనోళ్ల ముందంజ

రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ పోటీలు తొలి రోజు హోరాహోరీగా కొనసాగాయి. అండర్–11 కేటగిరీ నుంచి సీనియర్స్ వరకు క్రీడాకారులు నువ్వా, నేనా అన్నట్లు తలపడ్డారు. కాగా, అండర్–17 బాలుర సింగిల్స్‌లో పూల్ విన్నర్‌గా పి.జ్యావిత్, అండర్ –13 సింగిల్స్‌లో కోగిరి హితేష్ ముందంజలో నిలిచి నాకౌట్ దశకు చేరడం విశేషం. బాలికల విభాగంలో జి.సిరి తొలి మ్యాచ్‌లో విజయం సాధించింది.

ఠాణాలో సీఐ ఎదుటే దాడి

బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు

మణుగూరు రూరల్: మున్సిపాలిటీకి చెందిన ఓ బినామీ ఇసుక కాంట్రాక్టర్ తనపై అకారణంగా పోలీస్‌స్టేషన్‌లోనే దాడికి పాల్పడ్డాడని బాధితుడు మునిగెల నాగేశ్వరరావు శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడి కథనం ప్రకారం.. కమలాపురానికి చెందిన నాగేశ్వరరావు ప్రస్తుతం సింగారంలో నివాసం ఉంటున్నాడు. పొలం వద్దకు బైక్‌పై వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ఇసుక లారీతో ప్రమాదం జరిగే పరిస్థితి ఏర్పడింది. త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. దీంతో లారీ డ్రైవర్‌తోపాటు సదరు బినామీ కాంట్రాక్టర్ గంటా రమేశ్‌కు ఫోన్ చేసి మందలించాడు. కోపోద్రిక్తుడైన బినామీ కాంట్రాక్టర్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించగా, సీఐ ఎదుటే దుర్భాషలాడుతూ పిడిగుద్దులు గుద్ది గాయపరిచాడు. విషయం బయటికి వస్తే కమలాపురం గ్రామస్తులతో కులంపేరుతో దూషించాడని కేసు పెట్టిస్తానని సీఐ ఎదుటే బెదిరించాడని బాధితుడు వాపోయాడు. ఈ విషయమై ఎస్‌ఐని వివరణ కోరగా.. బాధితుడి ఫిర్యాదు మేరకు గంటా రమేశ్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.

బంగారు ఆభరణాలు చోరీ

చర్ల: మండలంలోని గొమ్ముగూడెంలో భారీ చోరీ జరిగిన ఘటన శుక్రవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం... గొమ్ముగూడెంలోని గాంధీనగరానికి చెందిన కోడిరెక్కల భాస్కర్‌రావు కోడలు గర్భిణీ కావడంతో డెలివరీ కోసం ఇంట్లో వారంతా బుధవారం భద్రాచలం వైద్యశాలకు వెళ్లారు. గురువారం రాత్రి భాస్కర్‌రావు తిరిగివచ్చేసరికి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా రెండు బీరువాలను పగులగొట్టి రూ.12 లక్షల విలువ చేసే 90 గ్రాముల బంగారు ఆభరణాలను, రూ. 80 వేల నగదును అపహరించారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా సీఐ ఏ రాజువర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్ శుక్రవారం సంఘటనా స్థలాన్ని సందర్శించారు. క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గొర్రెకు మూడు పిల్లలు జననం

బూర్గంపాడు: గొర్రెకు మూడు పిల్లలు జన్మించిన ఘటన శుక్రవారం మోరంపల్లిబంజరలో చోటుచేసుకుంది. సాధారణంగా గొర్రెకు ఒక ఈతలో ఒకటి, రెండు పిల్లలు పుడతాయి. కానీ కామిరెడ్డి వెంకటరెడ్డి గొర్రెల ఫామ్‌లో ఓ గొర్రెకు మూడు పిల్లలు జన్మించాయి. ఇలాంటి ఘటనలు అరుదుగా జరుగుతాయని పశు వైద్యులు తెలిపారు.


మూడు పిల్లలతో గొర్రె